## నేటి రాజకీయం

ఓటు వేయు నాటి ఓటరు దేముడే

అయ్య పదవి పొంద దెయ్యమాయె

ఓడ మల్లనాయె బోడి మల్లన్నగా

నేటి లోక రీతి పాటు కనుమ

నీతి నియమమెల్ల నిలువు లోతున పాతి

సిగ్గు లజ్జ వీడి చేరు వాడె

రాజకీయమందు రాణించురా నేడు

నేటి లోక రీతి పాటు కనుమ

కులము మతము ధనము కూడినవారిదౌ

నేర చరిత స్వార్థ తీరు సైచి

ఓట్లు వేయ గెలిచి ఊళ్ళని దోచడా?

నేటి లోక రీతి పాటు కనుమ

అడ్డుపడుట, గోల, అవహేళనంబులు

వెకిలి నవ్వు, తిట్లు, మకిల పనుల

చట్ట సభలతీరు చట్టుబండాయెరా

నేటి లోక రీతి పాటు కనుమ

భర్త మరణమొంద భార్యకు సీటిచ్చి

చట్టసభకు పంప సనుభూతి

పార్టి స్వామ్యమాయె, ప్రజల స్వామ్యమ్మోనె?

నేటి లోక రీతి పాటు కనుమ

ప్రభుల వైద్యశాల పరిపుష్టి చేయక
అస్మదీయ వైద్యు కనుమతిచ్చి
రోగ భీమ పేర భోగాలు పంచెరా
నేటి లోక రీతి పాటు కనుమ

గడ్డి మేసినట్టి గడుసరి లలూని
దూరవాణి సంస్థ దోచు సచివు
పదవి కొరకు సైప ప్రభువు లంచము కాదె?
నేటి లోక రీతి పాటు కనుమ

సెజ్జు వంక మంచి సేద్యపు భూమినే
పేద నుంచి లాగి పెద్ద కివ్వ
అతనికన్న రాక్షసాంశజు డెవరయా?
నేటి లోక రీతి పాటు కనుమ

మంచి విడచిపెట్టి లంచాలు చేపట్టి
నేటి దైవ భూమి వాటబట్టి
కల్లు సార కొట్లు కొల్లగొట్టెను నేత
నేటి లోక రీతి పాటు కనుమ

ఆత్మ బంధు,భృత్యు లడిగిన వెంటనే
క్రమము కాని పనుల కనుమతిచ్చి
నేత దోచిపెట్టె జాతి సంపదనెల్ల
నేటి లోక రీతి పాటు కనుమ

మంత్రి పదవి పొంది మన క్షేమ మేమార్చి
ఎదురుతిరుగు వారి నేరిపైచి
దోచి దాచుకొనెడి దుష్టుడే మననేత
నేటి లోక రీతి పాటు కనుమ

నేత మరణ వర్త నెర బాధ పెట్టంగ
భార్య హితులు సుతులు బ్రతికి యుండ
జనము చచ్చిరనుట జగమున కడువింత
నేటి లోక రీతి పాటు కనుమ

బస్సు తగులబెట్టి పలువురి పరిమార్చి
పట్టు బడినవారు బడుగులనుచు
శిక్ష మార్పుచేయ శిష్టమా? అరిష్టమా?
నేటి లోక రీతి పాటు కనుమ

ఉగ్ర వాదులకును ఊతంబుగా నిల్చి
వారి మతము చూసి వదలి పెట్ట
లౌకికతయో, ప్రభువు లౌల్యమో  తెలుసుకో
నేటి లోక రీతి పాటు కనుమ

ఆనకట్ట చూడ అడిగిన నేతల
పట్టి, కొట్టి, చెరను పెట్టె గదర
పక్క రాష్ట్ర ప్రభువు, పరదేశ ప్రభువేమి?
నేటి లోక రీతి పాటు కనుమ

తాగి తాగువారి ధనమును పిండేసి
బడుగు హితము కూర్చు పనుల తీరు
ధనము తస్కరించి దారిఖర్చిడినట్లు
నేటి లోక రీతి పాటు కనుమ